గిరిజనులకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి- అనంతగిరి: మండలంలోని టోకూరు పంచాయతీ దొరగూడ, కొత్తవలస, బలియగూడ గ్రామాల్లోని గిరిజనులకు అల్లూరి వాకర్స్ సేవా సంస్థ ఆధ్వర్యాన రగ్గులను పంపిణీ చేశారు. ఆయా గ్రామాలకు చెందిన 100 మంది కుటుంబాలకు రగ్గులు అందజేశామని సంస్థ కోఆర్డినేటర్ ప్రభాకర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్, సిపిఎం నేత కిల్లో మోసియా, మాజీ సర్పంచ్ దొన్ను చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సిపిఎం నేత దేవన, పీసా కమిటీ సభ్యులు సోమేష్, లక్ష్మణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

రగ్గులు ఇస్తున్న నాయకులు

నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న అరకు శ్రామిక ఉత్సవ్

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ గిరిజన మ్యూజియం సమీపంలో సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అరకు శ్రామిక ఉత్సవ్ ఆకట్టుకుంది. సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభల సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అరకులోయలో విజయవంతంగా నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక నృత్యాలు, థింసా, కూచిపూడి, ఆటలు పాటలతో కళా ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వీక్షిస్తున్న పిల్లలు, తల్లిదండ్రులు

అరకు కాఫీ నాణ్యత పెంపునకు కృషి

-శత దినోత్సవంలో కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి పాడేరు : అరకు కాఫీకి అంతర్జాతీయ గుర్తింపు లభిస్తోందని జిల్లా కలెక్టర్ వెల్లడించారు కర్ణాటకలో సెంట్రల్ కాఫీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన శతాబ్ది ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 1925లో స్థాపించబడిన సిసిఆర్ఐ, కాఫీ పరిశోధనలో వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించడంపై కొనియాడారు. అల్లూరి జిల్లా అరకు కాఫీ అభివృ, భవిష్యత్తు అనుభవాలపై వివరించారు అరకు కాఫీకి ప్రపంచ స్థాయికి గుర్తింపు ఉందని జిల్లా కలెక్టర్ అన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పడేలా అరకు కాఫీ నాణ్యతను మరింత పెంచడంపై దృష్టి సారించామన్నారు.ప్రాసెసింగ్ యూనిట్లు,కాఫీ గింజల ప్రాసెసింగ్ కోసం అత్యాధునిక యంత్రాలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. గిరిజన రైతులకు శిక్షణ, సాగు పద్ధతుల్లో మెళకువలు నేర్పించి, దిగుబడి పెంచడం ద్వారా గిరిజన రైతుల ఆదాయాన్ని పెంచడం లక్ష్యంగా గ్లోబల్ బ్రాండింగ్లో అరకు కాఫీ' బ్రాండ్‌ను మరింతగా ప్రమోట్ చేసి, విదేశీ ఎగుమతులను ప్రోత్సహించడం జరుగుతుందని అన్నారు. చిక్కమగళూరు రీసెర్చ్ సెంటర్‌లో నేర్చుకున్న కొత్త పద్ధతులను అరకు ప్రాంతంలోని వాతావరణానికి అనుగుణంగా అమలు చేయడం పై దృష్టి పెడతామన్నారు. ఈ పర్యటన ద్వారా అరకు కాఫీ రంగానికి కొత్త ఊపు లభిస్తుందని, పరిశోధనా సంస్థల సహకారంతో స్థానిక రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు.

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

తాగునీటి సమస్యపై నిరసన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని మాడగడ పంచాయతీ పరిధిలోని దానిరంగిని గ్రామంలో తీవ్రమైన తాగునీటి కొరత నెలకొంది. గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు గతంలో వేసిన బోరు చాలా కాలంగా పనిచేయలేదు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని సోమవారం గ్రామస్తులు సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. సిపిఎం నేతలు మాట్లాడుతూ, వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో నీటి సమస్య మరింత తీవ్రమవుతుందని, ప్రస్తుతం నీరు లేక గ్రామ ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం నీటి ఎద్దడి కారణంగా జలుబు, దగ్గు వంటి ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి దానిరంగిని గ్రామానికి శాశ్వతంగా తాగునీటి సరఫరా ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొర్ర బలరాం, కొర్ర ధనుంజయ్, టి అర్జున్,టిమహదేవ్, కొర్ర ముత్యాలమ్మ, కొర్ర డొమిని, సమర్ది రంభ, తాంగుల మొత్తి తదితరులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న గ్రామస్తులు

జి.మాడుగులో సత్కరిస్తున్న నాయకులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- జి.మాడుగుల: మండలంలోని సోలభం పంచాయతీ పరిధిలోని మధురుమామిడిలో ఎస్.టి. థామస్ ఇంగ్లీష మీడియం స్కూల్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపల్ ఫాదర్ స్టీపెన్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. సోలభం సర్పంచ్ హనుమంతరావు, మాజీ ఎంపీపీ ఎం. వెంకట గంగరాజు హాజరై క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి క్రిస్మస్ సందేశాన్ని పంచుకున్నారు. విద్యార్థుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో తెదేపా నాయకులు కె.కళ్యాణం, ఆర్.కొండబాబు, ఉపాధ్యాయులు , విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నారులకు బహుమతులు ఇస్తున్న పాస్టర్లు

ఎస్ఐల బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి- జి.మాడుగుల: స్తానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ షణ్ముఖరావు సోమవారం బదిలీ కావడంతో నూతన ఎస్ఐ సాయి పడాల్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు వీరిని ఘనంగా సత్కరించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని నూతన ఎస్ఐ సాయి పడాల్ తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్ఐగా నాని బాధ్యతలు స్వీకరించారు. ఈ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ విజయనగరం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, గంజాయి నిర్మూలన; తదితర వాటిపై దృష్టి సారిస్తానన్నారు.

ఎస్ఐ నాని

గ్రంథాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలో ఉపమాక గ్రంథాలయాన్ని సోమవారం ప్రథమ శ్రేణి గ్రంథాలయాధికారి పి.దమయంతి సందర్శించి వార్షిక తనిఖీ చేపట్టారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి రికార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేశారు. విద్యార్థులతో సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు.

విరాళాల సేకరణ

ప్రజాశక్తి-పెదబయలు : నెల్లూరి జిల్లాలో గంజాయి గూండాల చేతిలో హత్యకు గురైన డివైఎఫ్ఐ నాయకులు పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన సోమవారం మండల కేంద్రంలోని వారపు సంతలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ అల్లూరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జీవన్ కృష్ణ, కార్తీక్ మాట్లాడుతూ పెంచలయ్య గంజాయికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేయగా, ఓర్చుకోలేని గంజాయి ముఠా ఆయన్ను హత్య చేసిందని తెలిపారు. దీంతో పెంచలయ్య కుటుంబం రోడ్డున పడిందని, ఆయన కుటుంబాన్ని ఆదుకొనేందుకు ప్రజలు విరాళాలు ఇవ్వాలని కోరారు. వారపు సంతలోనూ, వివిధ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ విరాళాలు సేకరించారు.

ప్రభుత్వ నిర్ణయాలతో విద్యారంగానికి భ్రష్టు

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి
ఘనంగా యుటిఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశాలు
నూతన కార్యవర్గం ఎన్నిక

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి:

ప్రస్తుతం విద్యారంగంలో తీసుకుంటున్న నిర్ణయాలు ప్రభుత్వ విద్యారంగాన్ని భ్రష్టుపట్టించే విధంగా ఉన్నాయని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి విమర్శించారు. స్థానిక వనవిహారి ప్రాంగణంలో అల్లూరి సీతారామరాజు జిల్లా నూతన కౌన్సిల్ సమావేశాలు ఘనంగా నిర్వహించారు. పాడేరు, చింతూరు, రంపచోడవరం డివిజన్‌లో మొత్తం 22 మండలాల నుంచి యుటిఎఫ్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ పతాకం, ఎస్టిఎఫ్ఐ పతాకం, యుటిఫ్ పతాక ఆవిష్కరణ కార్యక్రమం సీనియర్ యుటిఫ్ నాయకులచే నిర్వహించడం జరిగింది. తదనంతరం మారేడుమిల్లి గ్రామ వీధుల్లో మండల శాఖ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభావేదిక వద్ద ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత చెన్నుపాటి లక్ష్మయ్య, యుటిఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి, వత్సవాయి సూర్యనారాయణరాజు, నాగటి నారాయణ, కచ్చా జార్జి విక్టర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. నాలుగో జిల్లా కౌన్సిల్ సమావేశాలకు జిల్లాశాఖ, మారేడుమిల్లి మండల శాఖ ఏర్పాటు చేయడమైనది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో బోధనేతర పనుల వలన ఉపాధ్యాయులు బోధనకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీగా ఇటీవల కాలంలో రాష్ట్ర విద్యాశాఖ అధికారులతో అనేకమార్లు ప్రాతినిధ్యం చేసి గిరిజన సంక్షేమ ఉపాధ్యా యుల లాంగ్వేజ్ పండిట్స్, పిఇటి అప్ గ్రేడేషన్ ఫైల్ ఆమోదం పొందడానికి తాను కృషి చేసినట్లు తెలిపారు. పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి. ప్రభాకర్‌వర్మ మాట్లాడుతూ యుటిఫ్ ఏర్పడి నేటికి 50 ఏళ్ళ కాలంలో అనేక రాయితీలు, సౌకర్యాలు కల్పించడానికి యుటిఫ్ విశేషమైన కృషి చేసిందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులుగా జి.విశ్వరాజ్, గౌరవ అధ్యక్షులుగా పి.కృష్ణయ్య, సహాధ్యక్షులుగా ఎస్.నాగేశ్వరరావు, సహాధ్యక్షురాలిగా వెంకటలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా కె.కృష్ణ, కోశాధికారిగా టి.బొజ్జయ్య ఎన్నికయ్యారు. ఆరుగురు కార్యదర్శివర్గం ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా రాష్ట్ర కార్యదర్శులు టివిజిజి. చక్రవర్తి, ఎస్.కిషోర్‌కుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు సూరిబాబు, ఆదిరెడ్డి మారేడుమిల్లి అధ్యక్షులు పండయ్య, ప్రధాన కార్యదర్శి కె.కృష్ణారెడ్డి, పూర్వ అధ్యక్షులు డి.మహేష్ సభ్యులు అబ్బాస్, త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షులు జి.విశ్వరాజు

ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ

ఉపాధిహామీ చట్టాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి - సీలేరు: మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించాలని సిపిఐ మండల కార్యదర్శి కవర్ల భగవాన్ డిమాండ్ చేశారు. జికె వీధి మండలం చిన్నగంగవరంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భగవాన్ మాట్లాడుతూ గ్రామీణ పేదలకు జీవనాధారమైన ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి కొత్త బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. వామపక్షాలు వ్యతిరేకించినా బలవంతంగా ఆమోదముద్ర వేశారని ఆరోపించారు. సిపిఐ నాయకులు నాగేశ్వరరావు మాట్లాడుతూ మహాత్మాగాంధీ పేరును తొలగించడంతో పాటు ఉపాధి హామీ హక్కును దెబ్బతీసే కుట్ర జరుగుతోందన్నారు. వామపక్షాలు వ్యతిరేకిస్తున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చట్టాన్ని టిడిపి, జనసేన పార్టీలు రాజ్యసభలో వ్యతిరేకించాలని కోరారు. ఏదైతే కేంద్రప్రభుత్వం కొత్తగా బివిజి రామ్‌జి బిల్లు 2020 చట్టాన్ని రద్దు చేసి గాంధీ పేరుతోనే ఉపాధి పనులు కొనసాగించాలన్నారు. కేంద్రం తీసుకున్న తప్పుడు విధానాలకు స్వస్తి పలికి రాజ్యసభలో తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. చట్టాన్ని రద్దు చేసేవరకూ భారత కమ్యూనిస్టు పార్టీ తరపున పోరాటం చేస్తూనే ఉంటామని హెచ్చరించారు. వ్యవసాయ సంక్షోభంలో కనీసం 200 పనిదినాలు కల్పించాలని రోజుకి 600 రూపాయలు చొప్పున కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పరదాని సోమర, పార్టీ నాయకులు దొర నారాయణ, ఆనందు బుధురో మహదేవ్ కవర్ల సహదేవ్, త్రినాథ, గోపాల్, మల్లేష్, రాము, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఐ నాయకులు

ఆసుపత్రులకు అంబులెన్స్‌లు మంజూరు

చింతూరు సిహెచ్‌సి, పెదవలస పిహెచ్‌సికి కేటాయింపు

చింతూరులో అంబులెన్స్ ప్రారంభిస్తున్న వైద్యసిబ్బంది, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-చింతూరు: పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ తనూజారాణి ఈ ప్రాంతంలో అత్యవసర వైద్యసేవలను బలోపేతం చేయడానికి ఎంపీ నిధుల కింద చింతూరు సిహెచ్‌సికి అంబులెన్స్ సర్వీసును అందించారు. ఎమ్మెల్సీ అనంతబాబు సోమవారం అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రోగులకు సకాలంలో వైద్యసేవలందిం చేందుకు అంబులెన్స్ ఉపయోగపడుతుందని, ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ తనూజారాణికి, ఎమ్మెల్సీ అనంతబాబుకు చింతూరు సిహెచ్‌సి సూపరింటెం డెంట్ డాక్టర్ కోటిరెడ్డి సిబ్బంది కృ తజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రామలింగారెడ్డి, జెడ్పీటీసీ మురళి, ఎంపిపి అమల, కోట్ల కృష్ణ వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జికె వీధి: మండలంలోని పెదవలస పిహెచ్‌సికి అంబులెన్స్ మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో కూటమి నాయకులు, వైసిపి నాయకులు, పిహెచ్‌సి వైద్యులు పృథ్వీస ఆధ్వర్యంలో అంబులెన్స్‌ను ప్రారంభించారు. పరిసర గ్రామస్తులంతా ఎంపి తనూజారాణికి కృతజ్ఞతలు తెలపారు. సర్పంచ్ పాంగి కృష్ణారావు, వైస్ ఎంపిపి సప్పగడ్డ ఆనందరావు, టిడిపి గ్రామ కమిటి అధ్యక్షులు పంద్ర నూకరాజు, వైసిపి పంచాయతీ అధ్యక్షులు కంకిపాటి శ్రీరాములు, వైసిపి మండల కార్యదర్శి సిరిబల రామారావు, లంబసింగి రమేష్, దేసేటి రాము, గెమ్మెల దొరబాబు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-మారేడుమిల్లి: మారేడుమిల్లి మండలం కొండవాడలో క్రిస్మస్‌ను యఫ్.సిఎస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ఎఫ్‌సిఎస్ మినిస్ట్రీస్ చైర్మన్ బిషప్ గొర్లె శ్రీకాంత్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలన్నారు. కొండవాడ గ్రామ గిరిజనులకు రగ్గులు, దుప్పట్లు, దుస్తులు, తినుబండారాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు నక్క ప్రవీణ్, కోరా లీలాకుమార్, కమిటీ సభ్యులు గొర్లె అఖిమ్, పాల్గొన్నారు.

సీలేరు: సందడి చేస్తున్న చిన్నారులు

సీలేరు: జికె వీధి మండలం సీలేరులో సోమవారం రాత్రి క్రైస్తవులు క్రిస్మస్‌కు ముందు నిర్వహించే క్యారల్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రిస్మస్ తాత వేషధారణలో చిన్నారులకు ముస్తాబు చేసి సీలేరు పురవీధుల్లో ఇంటింటికీ తిరుగుతూ సందడి చేశారు. క్రైస్తవులు ప్రతి ఇంటి వద్ద క్రీస్తు జననం గురించి వివరిస్తూ గీతాలు ఆలపించారు. దీంతో సీలేరులో ముందుగానే క్రిస్మస్ సందడి నెలకొంది. కార్యక్రమంలో యూసిఐఎం చర్చి పాస్టర్ మనసై తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : కొండవాడలో క్రిస్మస్ వేడుకలు

అడిషనల్ డిఎంహెచ్‌ఒపై విచారణ బహిర్గతం చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం
రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

ప్రజాశక్తి- చింతూరు: డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ పుల్లయ్య వేధింపులు, అక్రమాలు అవినీతి, అధికార దుర్వినియోగంపై జరిగిన విచారణ రిపోర్టును బయటపెట్టాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ చింతూరు ఐటిడిఎ పరిధిలోని 10 పిహెచ్‌సిలో పనిచేస్తున్న వైద్యులు పత్రికా ప్రకటన విడుదల చేసిన అనంతరం విచారణ చేపట్టిన అధికారులు డాక్టర్ పుల్లయ్యపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని లోతా రామారావు ప్రశ్నించారు. ఏజెన్సీలో గిరిజనులకు అందే అంతంత మాత్రంగా అందుతున్న వైద్యం కూడా పుల్లయ్యలాంటి వారి వలన అందకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పదిమంది డాక్టర్లు కంప్లైంట్ చేసిన అనంతరం విచారణ చేపట్టిన అధికారులు, విచారణ రిపోర్టును ఎందుకు బహిర్గతం చేయడం లేదంటూ ప్రశ్నించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని నియంతల వ్యవహరి స్తూ డాక్టర్లను వేధింపులకు గురి చేస్తున్న డాక్టర్ పుల్లయ్యను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్ పుల్లయ్య తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆర్ఎంపీలను, డాక్టర్లను బెదిరిస్తూ పేషెంట్ రిఫరీలు తన ప్రైవేట్ క్లినిక్‌కి తరలిస్తూ వ్యాపారం చేసుకుంటున్నారని లోతా రామారావు ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారణలో వెలుగు చూసిన అంశాలను బహిరంగపరచాలని, అలాగే డాక్టర్ పుల్లయ్య పై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.

యుటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన నాయకులు

ప్రజాశక్తి - పాడేరు: అల్లూరి జిల్లా శాఖ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలోని మారేడు మిల్లి మండల కేంద్రములో గల వన విహార్ లో యుటిఎఫ్ జిల్లా 4వ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ జిల్లా కౌన్సిల్ సమావేశంలో జిల్లా లోని 22 మండలాల నుంచి యుటిఎఫ్ మండల కమిటీల ప్రతినిధులు ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు: ఎస్.కిషోర్ కుమార్, టి విజిజి ఆర్ ఆర్. చక్రవర్తి ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. అనంతరం ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా నూతన ఎస్ఆర్ యుటిఎఫ్ జిల్లా శాఖ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గౌరవ అధ్యక్షులుగా టి. చిట్టిబాబు, అధ్యక్షులుగా కిల్లో. రఘునాథ్, ప్రధాన కార్యదర్శిగా వి.మహేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షులుగా: పీకటి నాగేశ్వరరావు , యం.పార్వతి , కోశాధికారిగా ఎం. ధర్మారావు, జిల్లా కార్యదర్శులుగా పి.దేముడు, ఎస్.కన్నయ్య, జి. ప్రసాద్, ఎం.శ్రీను, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎస్.రాంబాబు, సభ్యులుగా ఎల్.నారాయణ ఎన్నికయ్యారు.అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కిల్లో, రఘునాథ్, వి మహేశ్వరరావు మాట్లాడుతూ, నూతన శాఖను బలోపేతం చేసి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలియజేశారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు ఫోన్లు

ఫోన్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: మండలంలోని సుంకరమెట్ట పంచాయతీలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఫోన్లను సర్పంచ్ చినబాబు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్‌వాడీ కార్యకర్తలు పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రామకృష్ణ, టిడిపి నేతలు సంజీవ్‌కుమార్, మహిళా పోలీస్ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

సొలభంలో గ్రామసభ

ప్రజాశక్తి -జిమాడుగుల:మండలంలో గల సొలభం పంచాయతీలో కేంద్రంలో సోమవారం స్థానిక సర్పంచ్ ఐసరం హనుమంతరావు ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. గ్రామసభలో గొందిపాడు గ్రామాన్ని నూతన పంచాయతీగా ప్రకటించాలని తీర్మానించారు. 14 గ్రామాలకు సుమారు 2,200 మంది జనాభా కలిగి ఉండటంతో ప్రత్యేక పంచాయతీ ప్రకటించాలని కోరారు. ఈ మేరకు సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పంచాయతీ ఏర్పాటుకు ఎటువంటి అభ్యంతరం లేకపోవడంతో గొందిపాడును పంచాయితీ ఏర్పాటు కు సర్పంచ్ మరియు వార్డ్ మెంబర్లు గ్రామ ప్రజలు సమక్షంలో తీర్మనించడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కె.చిన్నారావు, సెక్రెటరీ, చిన్నం నాయుడు, ఎస్ కొండలరావు, మాజీ ఎంపిటిసి, ఎల్ బాలయ్య దొర, కే చిన్నయ్య దొర పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

గంగవరం: ఆకట్టుకుంటున్న గణిత రంగవల్లులు

కాశీపట్నంలో గణిత దినోత్సవం నిర్వహిస్తున్న టీచర్లు, విద్యార్థులు

ప్రజాశక్తి - సీలేరు: జికె వీధి మండలం సీలేరు డివిజ పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం నాగేంద్రరాజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణితశాస్త్రానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. నిత్యజీవితంలో గణితబోధన ఆవశ్యకతపై వివరించారు. గణిత నమూనాలు ప్రదర్శించారు. గణిత ఉపాధ్యాయులు పలి కల్యాణ్, బాలరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం: బాలికల ఆశ్రమ ఉన్నతపాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గణిత టాలెంట్ టెస్ట్, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు, గణితబోధనోపకరణ ప్రదర్శన నిర్వహించారు. హెచ్‌ఎం అధికారిత్వ బృందం శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గణిత ఉపాధ్యాయులు విజయకుమారి, అన్నపూర్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన టిఎల్‌ఎం ప్రదర్శన, గణిత రంగవల్లులు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు అందించారు. గణిత ఉపాధ్యాయులను సన్మానించారు. డిప్యూటీ వార్డెన్ లావణ్య, పీడీ చిన్నపాప సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రీనివాస రామానుజన్ జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం గణితశాస్త్ర దినోత్సవం నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె. రత్నమాణిక్యం తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ ముల్లి శేఖర్ మాట్లాడుతూ దైనందిన సమస్యల పరిష్కారానికి గణితం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. గణిత శాస్త్ర విభాగాధిపతి కె. కీర్తి మాట్లాడారు. వ్యాసరచన, క్విజ్, పెయింటింగ్ పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వై.పద్మ, డాక్టర్ శకుంతల, నాగమోహన్‌రావు పాల్గొన్నారు.

కాశీపట్నం:మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల (బాలికలు)లో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అర్జున్, పుణ్యవతిలు రామానుజన్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, సుబ్బారావు, అప్పలరాజు, రాధిక, కమల పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని శారద నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్ మత్స్యరాజు, డొన్నులు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతపల్లి : ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని చింతపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సుమనులు శ్రీనివాస పాత్రుడు మాట్లాడుతూ విద్యార్థులు గణిత శాస్త్రంపై పట్టు సాధించడం అత్యంత అవసరమని తెలిపారు. కార్యక్రమంలో గణిత శాస్త్ర అధ్యాపకులు వంతల వెంకటరమణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని రామానుజన్‌కు ఘన నివాళి అర్పించారు.

చింతూరు: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం, వైస్ ప్రిన్సిపల్ శేఖర్

బోగస్ కుల ధ్రువీకరణలు రద్దు చేయించాం

ప్రజాశక్తి-చింతపల్లి : భారత గిరిజన ఉద్యోగుల సంఘం సహకారంతో బోగస్ కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయించగలిగామని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు తెలిపారు. చింతపల్లి మండలం గొందిపాకల పంచాయతీ పరిధిలో గొందిపాకలు, సమగిరి గ్రామాలకు చెందిన చింతపల్లి జ్యోత్స్న, చింతపల్లి రాంబాబు, దుమ్ముల అనితా కుమారి, దుమ్ముల మధుబాబు అనే వారు గిరిజన వాల్మీకి ఉపజాతికి చెందినవారిగా 2025 మే 25న గిరిజన కుల ధ్రువీకరణ పత్రాలు పొందారని పేర్కొన్నారు.

దీనిని ఆన్‌లైన్ ద్వారా పరిశీలించగా, చింతపల్లి, దుమ్ముల ఇంటిపేర్లు వాల్మీకి ఉపజాతికి చెందినవిగా లేవని, గొందిపాకలు, సమగిరి గ్రామాలలో వాల్మీకి ఉపజాతి కుటుంబాలు లేవని తేలిందని పేర్కొన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదు చేయగా, చింతపల్లి తహశీల్దార్ కె.శంకర్ రావు విచారణ చేపట్టి సంబంధిత కుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన దరఖాస్తులు గొందిపాకలు సచివాలయం ద్వారా జరగలేదని సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ స్పష్టం చేసినట్లు తెలిపారు. అప్పటి తహశీల్దార్ టి.రామకృష్ణ ఈ ధ్రువీకరణ పత్రాలను ఆమోదించలేదని వీఎస్‌డబ్ల్యూ ఆన్‌లైన్ రికార్డుల ద్వారా తేలిందన్నారు. దీంతో ఆ కుల ధ్రువీకరణ పత్రాలను జీఎస్‌డబ్ల్యూ పోర్టల్‌లో రద్దు చేసినట్లు తహశీల్దార్ కె. శంకర్ రావు ఎండార్స్‌మెంట్ ద్వారా వెల్లడించినట్లు పేర్కొన్నారు.

అంబులెన్స్ ప్రారంభం

ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి, సర్పంచ్

ప్రజాశక్తి - అనంతగిరి: ఆసుపత్రిలోని రోగులకు అందుబాటులో ఉండేందుకు అరకు ఎంపీ తనూజారాణి నిధులతో అంబులెన్స్ ఏర్పాటు చేశారు. ఈ అంబులెన్స్‌ను వైద్యాధికారి జ్ఞానేశ్వరి, జడ్‌పిటిసి గంగరాజు, సర్పంచ్ రూతు ప్రారంభించారు. కూటమి నాయకులు మురళి, సిపిఎం నేతలు నాగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపిపిగా శకుంతల

ప్రజాశక్తి - అనంతగిరి: మండల ప్రజా పరిషత్ ఇన్‌ఛార్జి అధ్యక్షురాలిగా శకుంతల సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎంపిపీగా కొనసాగిన నీలవేణి అవిశ్వాస తీర్మానంలో పదవి కోల్పోయినందున వైస్ ఎంపిపి శకుంతలకు ఇన్‌ఛార్జి ఎంపిపిగా బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు సూర్యనారాయణ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గీతం విద్యార్థుల వారసత్వ నడక

వారసత్వ నడకలో గీతం విద్యార్థులు

ప్రజాశక్తి - మధురవాడ : విద్యార్థులకు వారసత్వ సంపద, ప్రాచీన కట్టడాల చారిత్రక నేపథ్యంపై అవగాహన కలిగించడానికి తం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని చరిత్ర విభాగం, ఇంటాచ్ విశాఖపట్నం శాఖ సంయుక్తంగా సోమవారం విశాఖపట్నం వన్‌టౌన్ ప్రాంతంలో వారసత్వ నడకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ప్రాంతంలోని నగర వీధులను ఒక ఓపెన్ క్లాస్‌రూమ్‌గా మార్చి దైనందిన జీవితంలోనే చరిత్ర ఎలా జీవించి ఉందో విద్యార్థులకు పరిచయం చేశారు. 'విశాఖపట్నం త్రిటౌన్ లెర్న్‌వైల్ వాక్' శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో గీతం విశ్వవిద్యాలయం విద్యార్థులతో పాటు విశాఖ వాలీ స్కూల్, టింపనీ సీనియర్ సెకండరీ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లకు చెందిన విద్యార్థులు ఉపాధ్యాయలు పాల్గొన్నారు. వారసత్వ నడకలో భాగంగా టౌన్ హాల్, సెయింట్ జాన్స్ చర్చ్, క్వీన్ మేరీస్ స్కూల్ భవనం, సెయింట్ అలోయియస్ ఆంగ్లోఇండియన్ హైస్కూల్, పాత లైట్ హౌస్, జయపూర్ మహరాజుల సముద్రతీర గిరిష్మ నివాసమైన ప్రసిద్ధ హవా మహల్ వంటి ముఖ్యమైన వారసత్వ కట్టడాలు సందర్శించారు. ప్రతి ప్రదేశంలో చర్చల ద్వారా విద్యార్థులకు వలస పాలన కాలపు నగర ప్రణాళిక, సముద్ర చరిత్ర, పౌర పరిపాలన, రాజాశ్రయం వంటి అంశాలతో పాటు నగర చారిత్రక అభివృద్ధిని ఎలా ప్రభావితం చేసిందో వివరించారు.

మహరాణిపేటలోని పాత మున్సిపల్ కార్యాలయం భవనం వద్ద (ప్రస్తుతం ఆ భవనం ఆంధ్రప్రదేశ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ (ఏపిహెచ్ఆర్డిఐ) ప్రాంతీయ కేంద్రం, విశాఖపట్నంగా పనిచేస్తోంది) ఎపిహెచ్‌ఆర్‌డిఐ అధికారులు విద్యార్థులతో మాట్లాడి, పునరుద్దరించబడిన ఈ వారసత్వ భవనం చారిత్రర ప్రాముఖ్యత, దాని పునర్వినియోగం (అడాప్టివ్ రియూజ్), అలాగే పరిపాలనా శిక్షణ, సామర్థ్య అభివృద్ధిలో సంస్థ పాత్ర గురించి వివరించారు. హోమిల్డన్ మెమోరియల్ మాసానిక్ టెంపుల్, అయిన 19వ శతాబ్దానికి చెందిన మాసానిక్ భవనం చారిత్రక ప్రాధాన్యతను, నగర సామాజిక చరిత్రలో దాని స్థానాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ వారసత్వ నడకలో భాగంగా హవా మహల్ వద్ద పరస్పర చర్చ జరిగింది. జయపూర్ రాజమాత మయాంక్ కుమారి దేవి విద్యార్థులు, గీతం అధ్యాపకులతో మమేకమై జయపూర్ రాజవంశ పరంపర మహల్ చరిత్ర, దాని సాంస్కృతిక, శిల్పాకళా ప్రాధాన్యతపై పరస్పరం అభిప్రాయాలను పంచుకున్నారు.

చంద్రరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

వైసిపి నాయకులు చంద్రరావుకు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు పరామర్శ

ప్రజాశక్తి- జికెవీధి: మండలంలోని మాజీ జెడ్‌పిటిసి వైసిపి సీనియర్ నాయకులు మామిడి చంద్రరావు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అల్లూరి జిల్లా వైసిపి అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు నిమ్మలపాలెం గ్రామానికి వెళ్లి సోమవారం ఆయనను పరామర్శించారు. వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులు గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నిత్యావసర వస్తువులు అందిస్తున్న సిఐ కన్నప్పరాజు, ఎస్ఐ రామకృష్ణ

నిత్యావసర వస్తువుల పంపిణీ

ప్రజాశక్తి-కూనవరం: మండలంలోని కన్నపురం గ్రామంలో సుమారు 35 కుటుంబాలకు సిఐ కన్నప్పరాజు, ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, దుస్తులు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలిపులి

ప్రజాశక్తి -సీలేరు: జికెవీధి మండలం సీలేరులో చలి మంచు రోజురోజుకీ గణనీయంగా పెరిగిపోవడంతో ప్రజలు చలికి తాళలేక భయాందోళన చెందుతున్నారు. సోమవారం ఉదయం 8:30 వరకు మంచు వీడలేదు. పరిసర ప్రాంతాల్లో మంచు కమ్మేసి చల్లటి శీతల వాతావరణం నెలకొంది. దుకాణాలు 8 గంటల వరకు తెరుచుకోలేదు. చలి తీవ్రతకు ప్రజలు తట్టుకోలేక గజగజ వణుకుతున్నారు. నెల రోజుల నుంచి వాతావరణంలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని రోజులు చలి అధికంగా ఉంటే మరికొన్ని రోజులు మంచు అధికంగా ఉంటోంది. రాత్రి 8 గంటలకు చలి తీవ్రత క్రమేపి పెరిగిపోవడంతో ఇండ్లకే పరిమితం అవుతున్నారు.

ఉదయం 8 గంటలకు కురుస్తున్న మంచు

ఇకపై ఆన్‌లైన్‌లో సర్వే సర్టిఫికెట్లు

- మేయర్ పీలా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని భవనాలు, ఖాళీ స్థలాలకు ఇకపై సర్వే సర్టిఫికెట్లు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనే పొందవచ్చునని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశమందిరంలో సర్వే సర్టిఫికెట్ అప్లికేషన్‌ను జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర పరిధిలో భవనాలు, ఖాళీ స్థలాలకు సర్వే సర్టిఫికేట్ పొందవలసి ఉన్నందున ప్రజలకు ఇబ్బందులు లేకుండా జివిఎంసి కమిషనర్ వినూత్న ఆలోచనతో సర్వే సర్టిఫికెట్లను జివిఎంసి వెబ్‌సైట్ ద్వారా ఇకపై సులభంగా ఆన్‌లైన్‌లోనే జారీ చేసేందుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. దీనివల్లన వారం రోజుల్లోనే సర్వే సర్టిఫికెట్స్ పొందువచ్చునన్నారు. సర్వే సర్టిఫికెట్లు వారం రోజుల్లో జారీ అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ ఇకపై వారం రోజులలో సులభంగా ఆన్‌లైన్‌లోనే సర్వే సర్టిఫికేట్ పొందవచ్చునన్నారు. రెవిన్యూ, పట్టణ ప్రణాళిక అధికారులకు, వార్డ్ సచివాలయం కార్యదర్శిలకు దీనికి సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని జివిఎంసి ఉన్నతాధికారులను కమిషనర్ ఆదేశించారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి- ఎంవిపికాలనీ: విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 1983 ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం గెట్‌టుగెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా తమ కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. అప్పటి మధుర జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. కార్యక్రమంలో పలు ఆటలపోటీలు నిర్వహించగా, అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఐదుగురు పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానించడం ఈ సమావేశం లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. వారి సేవలను గుర్తించి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో పలు సామాజిక, సేవా కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించుకున్నారు.


సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఐఎన్ఎస్ సర్కార్స్ కమాండింగ్ ఆఫీసర్‌గా కమోడోర్ కార్తీక్‌మూర్తి

కమోడోర్ కార్తీక్‌మూర్తి

ప్రజాశక్తి-ఎంవిపికాలనీ: తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం పరిధిలోని కీలక బేస్‌డిపో నౌక 'ఐఎన్ఎస్ సర్కార్స్' కమాండింగ్ ఆఫీసర్‌గా కమోడోర్ కార్తీక్‌మూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఈ బాధ్యతల్లో ఉన్న కమోడోర్ హ్యాపీ మోహన్, నుండి ఆయన అధికారికంగా బాధ్యతలను స్వీకరించారు. కమోడోర్ కార్తీక్ మూర్తి 1998, జనవరి 1న భారత నౌకాదళంలో కమిషన్ పొందారు. ఐఎన్ఎస్ టి 80, విపుల్, కుతార్ సాత్పురా వంటి యుద్ధనౌకలకు కమాండర్‌గా వ్యవహరించారు. ఇండోనేషియాలోని భారత రాయబార కార్యాలయంలో 'డిఫెన్స్ అటాచ్'గా దేశానికి సేవలందించారు. నౌకాదళంలో ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా 2023లో భారత ప్రభుత్వం ఆయనను 'విశిష్ట సేవా మెడల్' తో సత్కరించింది . నూతన కమాండర్‌గా బాధ్యతలు చేపట్టిన కమోడోర్ కార్తీక్ మూర్తికి నౌకాదళ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

సందడిగా 'సరస్-2025' డ్వాక్రాబజార్

భారీగా పెరుగుతున్న అమ్మకాలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్న అఖిల భారత 'సరస్-2025' డ్వాక్రా బజార్‌కు విశేష స్పందన లభిస్తోంది. డిసెంబర్ 15న ప్రారంభమైన ఈ ప్రదర్శన 26వ తేదీ వరకు కొనసాగనుంది. స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుం టున్నాయి. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు లక్ష్మిపతి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో దేశవ్యా ప్తంగా సుమారు 550 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నా రన్నారు. మొత్తం 266 స్టాల్స్‌లో వస్త్రాలు, హస్తకళలు మరియు ఆహార ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు హర్యానా లెదర్ బ్యాగులు, జార్ఖండ్ దుస్తులు, కాశ్మీర్ పట్టుచీరలు వంటి అనేక రకాల ఉత్పత్తులు ఇక్కడ లభిస్తున్నా యన్నారు. గత ఏడు రోజుల్లో సుమారు రూ. 9,73,97,900 విలువైన అమ్మకాలు జరిగాయన్నారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుండి రాత్రి 9:30 వరకు సందర్శకులను అనుమతిస్తారు. సాయంత్రం వేళల్లో ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రదర్శనను సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పోవర్టీ (సెర్ప్) , జిల్లా కలెక్టరు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

సందర్శకులతో కిటకిటలాడుతున్న డ్వాక్రా బజార్

వీఎంఆర్‌డిఏ చిల్డ్రన్ ఎరీనా బుకింగ్‌లు రద్దు

ప్రజాశక్తి- ఎంవిపికాలనీ: వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో జరగాల్సిన పలు కార్యక్రమాలను సాంకేతిక నిర్వహణ కారణాల దృష్ట్యా రద్దు చేస్తున్నట్లు మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మాన ఆనంద్ పేరు మీద బుక్ చేసిన 'గెట్ టు గెదర్' ప్రోగ్రాం కోసం ప్రాంగణంలో రాజకీయ బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తించారు. వీఎంఆర్డీఏ నిబంధన 10 ప్రకారం రాజకీయ ప్రచార సామాగ్రి ప్రదర్శించడం నిషేధం. వీటితో పాటు ప్రాంగణంలోని సెంట్రల్ ఏసీ పనిచేయకపోవడంతో, అత్యవసర మరమ్మతుల కోసం నేటి నుంచి మూడు రోజుల పాటు అన్ని కేటాయింపులను రద్దు చేశారు. బుక్ చేసుకున్న వారికి వారు చెల్లించిన మొత్తాన్ని తిరిగి చెల్లించినట్లు కమిషనర్ తెలిపారు.

అందుబాటులో 1229 టన్నుల ఎరువులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రబీ సీజన్‌కు సంబంధించి 1229 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి మీడియాకు తెలిపారు. జిల్లాలో రబీలో వ్యవసాయ, ఉద్యాన పంటలు సుమారుగా 2158 హెక్టార్లలో సాగు జరుగుతోందని, నేటి వరకు 6532 హెక్టార్లలో వివిధ పంటలు వేశారని తెలిపారు. రబీ పంటల సాగుకు 2800 టన్నుల ఎరువులు అవసరం ఉందని వివరించారు. రబీ ఆరంభం నాటికి జిల్లాలో 367 టన్నుల యూరియా వివిధ డీలర్ల దగ్గర అందుబాటులో ఉందని, మొత్తం 1415 టన్నుల యూరియా జిల్లాలో ఉన్నట్లు తెలిపారు.

గ్రామీణ బౌద్ధ వారసత్వ జాతీయ అకాడమీకి నాగార్జున కొండల భూమి కేటాయింపు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : భారతదేశంలోని గ్రామీణ బౌద్ధ వారసత్వాన్ని పునరుద్ధరించి పరిరక్షించేందుకు చేపట్టిన ప్రయత్నాల్లో ఆంధ్రప్రదేశ్‌ను ముందంజలో నిలిపేలా గ్రామీణ బౌద్ధ వారసత్వ పరిరక్షణ, అభివృద్ధి కోసం జాతీయ అకాడమీ స్థాపనకు నాగార్జునకొండలో 5 ఎకరాల భూమిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేటాయించిందని నీతి ఆయోగ్ పూర్వపు సిఇఒ డాక్టర్ అమితాబ్ కాంత్ తెలిపారు. విశాఖలో ఆయన మాట్లాడుతూ, న్యూఢిల్లీలో 3 రోజుల పాటు జరిగిన గ్రామీణ బౌద్ధ వారసత్వ పరిరక్షణపై అంతర్జాతీయ సదస్సు ముగింపు సందర్భంగా భూమి కేటాయింపు ప్రకటన వెలువడిందన్నారు.

త్వరలో మార్కెట్లోకి నిస్సాన్ 7-సీటర్ 'గ్రావైట్'

ప్రజాశక్తి-ఎంవిపికాలనీ: భారత ఆటోమొబైల్ రంగంలో తన ఉనికిని మరింత చాటుకునేందుకు నిస్సాన్ మోటార్స్ సరికొత్త వ్యూహాలతో సిద్ధమైంది. ఆధునిక భారతీయ కుటుంబాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, అత్యాధునిక ఫీచర్లతో కూడిన 'గ్రావైట్' 7-సీటర్ బి-ఎంపీవీ) వాహనాన్ని ఆవిష్కరించనున్నట్లు నిస్సాన్ మోటార్ ఇండియా డైరెక్టర్ సౌరభ్ వత్స వెల్లడించారు. సోమవారం విశాఖలోని ఒక ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిస్సాన్ సంస్థ చేపట్టిన 'రిఫ్రెష్డ్ ప్రొడక్ట్ లైనప్'లో భాగంగా వస్తున్న మొట్టమొదటి ఉత్పత్తి 'గ్రావైట్' అని తెలిపారు. 2026 ఏడాది ప్రారంభంలో అందుబాటులోకి రానుంది.

వైసిపిలో భారీ చేరికలు

ప్రజాశక్తి-ఎంవిపికాలనీ: నగరంలో వైసిపిలోకి జరుగుతున్న భారీ చేరికలను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలకు తెరలేపిందని పార్టీ శ్రేణులు ధ్వజమెత్తాయి. సోమవారం ధర్మాన ఆనంద్ వందలాది మంది అనుచరులతో కలిసి వైసిపిలో చేరేందుకు సిద్ధమవగా, చివరి నిమిషంలో ప్రభుత్వం అడ్డంకులు సృష్టించింది. కార్యక్రమం కోసం వీఎంఆర్డీఏకి రూ. 71,300 అధికారికంగా చెల్లించి, వుడా చిల్డ్రన్ థియేటర్ వేదికగా అనుమతి తీసుకున్నారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన జనసందోహాన్ని చూసి థియేటర్ సిబ్బంది గేట్లకు తాళం వేశారని నేతలు ఆరోపించారు. విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె. రాజు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు గేటు వద్దే బైఠాయించి అక్కడే పార్టీ చేరికల కార్యక్రమం నిర్వహించారు. ధర్మాన ఆనంద్‌తో పాటు పలువురు నేతలు, వందలాది మంది కార్యకర్తలకు కె.కె. రాజు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.